క్లుప్తంగా

స్పెషల్ డ్రైవ్

హుజూరాబాద్: రోడ్డు ట్యాక్స్ వసూల్‌కు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని హుజూరాబాద్ ఎంవీఐ సిరాజ్ ఉర్ రెహమాన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో మాట్లాడారు. మూడు నెలలకోసారి పన్నులు చెల్లించాలని, గడువులోపు పన్నులు చెల్లించకపోతే అదనంగా యాభైశాతం భారం పడుతుందని, మార్చి 31 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, పన్నులు చెల్లించక తనిఖీల్లో చిక్కితే రెండువందల శాతం జరిమానా విధించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అన్నిపత్రాలతో రోడ్లపై తిరగాలని, నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడపొద్దని సూచించారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ సర్వర్‌పాషా, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం కొనసాగింది. చెరువుకట్ట మరమ్మతు పనులు చేయడానికి వచ్చిన వాహనాలను అడ్డుకొని ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి మంగపేట గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు చెరువు కట్ట వద్ద టెంటు వేసుకొని దీక్ష చేస్తున్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి: పల్లె ప్రగతిలో పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండల పరిషత్‌లో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలకు అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా మరుగుదొడ్లు, చెత్తాచెదారం, మురుగునీటి నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, జిల్లా కోఆర్డినేటర్లు టి. రమేశ్, కె. వేణు ప్రసాద్, సురేందర్, శ్రీధర్, ఎంపీవో రాజగోపాల్ పాల్గొన్నారు.

మట్టిరోడ్లు లేని గ్రామమే లక్ష్యం

చిగురుమామిడి: నాలుగేళ్లలో దాదాపు రూ.60 లక్షలతో ఎనిమిది వార్డుల్లో సీసీరోడ్లు, మురుగుకాల్వల పనులు పూర్తి చేశామని ముదిమానిక్యం సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జక్కుల రవి తెలిపారు. సోమవారం గ్రామంలో మాట్లాడారు. మట్టిరోడ్లు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ సహకారంతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈజీఎస్ గ్రాంటు నుంచి రూ. 10 లక్షలతో రెండు, మూడు వార్డుల్లో సీసీరోడ్డు పనులు నాణ్యతతో పూర్తిచేశామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుంటే ఏ పని సక్సెస్ కాదన్నారు.

లేబర్‌కార్డులను పునరుద్ధరించుకోవాలి

హుజూరాబాద్: కార్మికశాఖ ద్వారా లేబర్‌కార్డులు పొందిన ప్రతి కార్మికుడు తప్పనిసరిగా గడువులోగా కార్డులను పునరుద్ధరించుకోవాలని హుజూరాబాద్ సహాయ కార్మికశాఖ అధికారి డి.చందన సోమవారం ప్రకటనలో కోరారు. గడువులోగా రెన్యూవల్ చేసుకోకుంటే కార్మిక సంక్షేమశాఖ అందించే అన్నిరకాల సౌకర్యాలకు అనర్హులు అవుతారని తెలిపారు.

ఇసుక రవాణా అరికట్టాలి



వినతిపత్రం ఇస్తున్న గౌడసంఘం నాయకులు

రామడుగు: రామడుగు–షానగర్ గ్రామ పరిధిలోని మోతె వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతూ సోమవారం మండల గౌడ్ సంఘం నాయకులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. వాగు నుంచి ఇసుక తరలిస్తుండటంతో గౌడ కులస్తులకు జీవనోపాధినిచ్చే తాటిచెట్లు పడిపోతున్నాయని, అధికారులు ఇసుక తరలింపును అరికట్టడం కోసం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు రాజయ్య, నాయకులు తిరుపతి, శ్రీకాంత్, తిరుపతి, పర్శరాం, రాజేశం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ ఎప్పుడో..?

- గ్రామాల వారీగా ప్రభుత్వ భూమి వివరాలు సేకరణ
- కేశవపట్నంలో భూమి కేటాయించి ఏళ్లు గడుస్తున్న వైనం



కేశవపట్నంలో పేదలకు పంపిణీ చేసేందుకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో ముళ్లపొదలు

శంకరపట్నం: ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నిరుపేదల్లో ఆశలు చిగురించాయి. ఇందుకు సంబంధించి అధికారులు భూముల వివరాలను సేకరించారు. శంకరపట్నం మండలంలోని 24 గ్రామాల్లో గ్రామకంఠం, ఆబాది, ప్రభుత్వ భూముల వివరాలను రికార్డుల పరంగా పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు సిద్ధం చేసుకున్నారు. అలాగే ఇళ్లులేని నిరుపేదల జాబితా తయారు చేసినట్లు సమాచారం. మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేశవపట్నం, కరీంపేట గ్రామాల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు నిర్మించారు. కేశవపట్నంలో ప్రభుత్వ స్థలం కేటాయించగా, కరీంపేటలో పట్టాభూమి కొనుగోలు చేయగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపు

మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి అధికారులు సమావేశాల నిర్వహించారు. ఎనిమిదేళ్లు గడిచినా ఇళ్ల నిర్మించకపోవడంతో ప్రజలకు ఎదురుచూపు మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేశవపట్నం పీహెచ్‌సీ పక్కన ప్రభుత్వ భూమి ఇళ్ల కోసం పేదలకు పంపిణీ చేయాలని ప్రతిపాదనలు చేశారు. సర్వే పూర్తి చేసి ప్లాట్లు చేసేందుకు అధికారులు సిద్ధమవుతుండగా అదికూడా పెండింగ్‌లో పడింది. ప్రభుత్వ స్థలం ఉన్నచోట అర్హులైన పేదలను గుర్తించి ఇంటి నిర్మాణానికి మూడు లక్షలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

150 మంది గుర్తింపు

కేశవపట్నంలో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలు 150 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పీహెచ్‌సీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం, ఆబాది, గ్రామ కంఠం భూమి కేటాయించేందుకు వివరాలు సేకరించారు. మండల వ్యాప్తంగా వివరాలు సేకరించినట్లు సమాచారం.

స్థలం కేటాయించాలి



ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలి. స్థలం కేటాయించి ప్రభుత్వం మూడు లక్షలు అందిస్తే ఇల్లు నిర్మించుకుంటాను. ఏళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూసినం.

– గోదారి లక్ష్మణ్, కేశవపట్నం

భూమి ధరలు పెరిగాయి



అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలం కేటాయించి పట్టా పంపిణీ చేయాలి. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇంటి స్థలం కేటాయింపు పేదలకు వరం. ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలి.

– సముద్రాల సంపత్, కేశవపట్నం

వివరాలు సేకరించాం



ప్రభుత్వం ఆదేశాలతో గ్రామ కంఠం, ఆబాది భూముల వివరాలు సేకరించాం. కేశవపట్నంలో ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉన్నట్లు గుర్తించాం. అర్హులకు పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే అందిస్తాం.

– శ్రీనివాస్‌రావు, తహసీల్దార్

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని షానగర్, గుండి గ్రామాల్లో సోమవారం కల్యాణ లక్ష్మి చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేశారు. షానగర్‌లో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.30 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చిప్పకుర్తి గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి మట్టి పనులు చేశారు. వారి ఇబ్బందులను గూర్చి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం కల్యాణలక్ష్మి, రైతు బంధు, దళితబంధు, మిషన్ భగీరథ, తదితర పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు,మురళీకృష్ణారెడ్డి, ఎంపీపీ కవిత, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మానస, కవిత, ఎంపీటీసీ శ్యాంసుందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, అశోక్‌కుమార్, కరుణాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన



శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ. నర్సింహారెడ్డి, వైద్యాధికారి సందీప్‌రెడ్డి, సునీల్, సర్పంచ్ నర్సింహారెడ్డి, మల్లేశం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని వంతడ్పుల గ్రామంలో సోమవారం సర్పంచ్ కంది దిలీప్‌రెడ్డి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ రవికిరణ్ శిబిరానికి వచ్చిన వారికి కంటి పరీక్షలు చేశారు. వైద్యాధికారి తులసిదాస్, క్యాంపు వైద్యాధికారి నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి స్వప్న, కారోబారు ఓదెలు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్: దళితబంధు రెండో విడుత నిధులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటం వెంకటేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని కమలాపూర్‌లో నిధులు మంజూరయ్యాయని, హుజూరాబాద్ మండలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు మోటం రాంచంద్రం, నాయకులు సాంబయ్య, సమ్మయ్య, పెద్దిరెడ్డి సమ్మయ్య, శ్రీనివాస్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న ఏజీఎం అనంత్ పట్నాల

సైదాపూర్: శిక్షణ పొందిన మహిళలు నాబార్డు ద్వారా అందిన ఆర్థిక సహకారంతో యూనిట్లు స్థాపించుకోవాలని, ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని నాబార్డు ఏజీఎం అనంత్ పట్నాల సూచించారు. సోమవారం నాబార్డు సహకారంతో సైదాపూర్‌లో నిర్వహించిన కుట్టుశిక్షణ, అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యూనిట్లు స్థాపిచుకునేవారికి నాబార్డు ద్వారా రుణాలు ఇవ్వనున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు స్టైఫండ్ చెక్కులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, కేడీసీసీ బ్యాంకు మేనేజర్లు ఆంజనేయులు, అశ్విని, ట్రైనర్లు గౌతమి, సునీత, వాణి ఉన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఇల్లందకుంట: మహిళలు మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నాబార్డ్ ఏజీఎమ్ అనంత్ పట్నాల అన్నారు. సోమవారం ఇల్లందకుంటలో నాబార్డ్ సౌజన్యం, స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అనంత్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికనుగుణంగా కుట్టిన దుస్తులను మార్కెటింగ్ చేయడంపై మహిళలు దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ కంకణాల శ్రీలత మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి స్టైఫండ్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు పద్మ, సాధన,గౌతమి, వాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గంగాధర: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ కార్యకర్తలు, నాయకులకు పిలుపు నిచ్చారు. మండలంలోని గర్శకుర్తిలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ గద్దె దించడానికే భరోసా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే ప్రజలకు మెరుగైన పథకాలు చేరుతాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తప్పుతోవ పట్టించడానికి బీఆర్‌ఎస్‌తో కొత్త నాటకంమొదలు పెట్టిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

పేదల సంక్షేమమే మోదీ లక్ష్యం

మానకొండూర్: పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రధాని పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ఉచితంగా కరోనా వ్యాక్సిన్, అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చేసిన రైతు బాంధవుడని అన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం, కిసాన్ సమ్మాన్‌నిధి, సుకన్య యోజన తదితర పథకాలు ప్రవేశ పెట్టారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ పంచాయితీలు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు.

కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి కోరారు. సోమవారం మండలంలోని రాంపూర్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు రాముల కుమార్ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాసమల్ల వేణు అధ్యక్షతన శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని, కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలపై బీజేపీ అలుపెరగని ఉద్యమాలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో నెరవేరలేదన్నారు.

కేంద్రం నిధులు పక్కదారి

చిగురుమామిడి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం కోరారు. మండలంలోని నవాబుపేట్ గ్రామంలో బూత్‌కమిటీ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కిసాన్ సమ్మాన్‌నిధి, ఉచిత బియ్యం, ఎరువులపై సబ్సిడీ, ఈ–శ్రమ్‌కార్డు, తదితర పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు.

నియామకం

హుజూరాబాద్ నియోజకవర్గ మైనార్టీ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడిగా సలీంపాషా



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హుజూరాబాద్ నియోజకవర్గ మైనార్టీ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు సలీంపాషా అన్నారు. సోమవారం సలీంపాషాకు అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌తాజ్ అందజేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌సోహెల్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, నియోజవర్గంలోని పార్టీ, యూత్, ఎన్‌ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- **సహకార సంఘం అధ్యక్షుడిగా నాగరాజు**



ఎన్నికైన నూతన కార్యవర్గం

గన్నేరువరం: మండలంలోని మైలారం యాదవ సంఘం ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుడ్డు నాగరాజు యాదవ్, కార్యదర్శిగా లెంకల మల్లయ్య, డైరెక్టర్లుగా జీల కొమురయ్య, నరాల సంపత్, లెంకల రమణయ్య, గొడుగు లత, మర్రి రమలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ దుడ్డు రేణుక, యాదవ కులబాంధవులు పాల్గొన్నారు.

- **ఇంటర్వ్యూలు**

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. హాజరైన 120 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. అర్హుల జాబితాను ప్రకటిస్తామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

- **బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు**

రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి నుంచి వెలిచాలకు వెళ్లే రహదారిలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వర్‌రావు నిధుల మంజూరు కోసం చేసిన వినతి మేరకు ప్రభుత్వం రూ. 4.40 కోట్లు విడుదల చేసింది. నిధుల మంజూరు కోసం కృషి చేసిన మంత్రులు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వెలిచాల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

- **ఆలయ నిర్మాణానికి విరాళం**



విరాళం అందిస్తున్న సత్యనారాయణరెడ్డి

చొప్పదండి: మండలంలోని మంగళపల్లి గ్రామంలో శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి గంగం శంకర్‌రెడ్డి స్మారకార్థం కుమారుడు సత్యనారాయణరెడ్డి సోమవారం రూ. 1,11,116 విరాళం అందించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి దాతలు సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, లక్ష్మణ్, జగన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తారురోడ్డు మంజూరు చేయాలని వినతి

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని సోమవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు విన్నవించారు. కొత్తపల్లి మండలం కొక్కెరకుంట నుంచి కోనేరుపల్లి ద్వారా కాట్నపల్లికి నిత్యం మూడు మండలాల ప్రజలు ప్రయాణిస్తున్నారని, కొక్కెరకుంట వద్ద వాగుపై వంతెన నిర్మాణంతో పాటు, కాట్నపల్లి వరకు తారురోడ్డు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే గ్రామానికి మంజూరైన పల్లె దవాఖాన నిర్మాణానికి భూమి కేటాయించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఎస్సారెస్పీ భూమి ఉన్నా రిజిస్ట్రేషన్ లేకపోవడంతో పల్లె దవాఖాన నిర్మిస్తలేరని, సమస్య పరిష్కరించాలని కోరారు.

అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

గంగాధర: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పాదయాత్రలో ఎమ్మెల్యేలు, మంత్రుల అక్రమాలపై ప్రశ్నిస్తే తట్టుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు అక్రమ కేసులు పెడుతున్నారని, వారికి భయపడే ప్రసక్తే లేదని పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ హెచ్చరించారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి, ఒద్యారం, కాసారం, కురిక్యాల గ్రామాలలో నాయకులు షర్మిలపై రోజురోజుకు పెరుగుతున్న దౌర్జన్యాలపై ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమం నిర్వహించారు. మధురానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సమాజం తలదించుకునే విధంగా మాట్లాడటంతో పాటు తప్పుడు ఫిర్యాదులతో కేసులు పెట్టడాని విమర్శించారు. ప్రజల పక్షాన నిలిచే వారినే ప్రజలు దీవిస్తారని, ప్రజాస్వామ్యంపై అవగాహన లేనివారు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు అంజయ్య,కుమ్మరి మల్లయ్య, ప్రభాకర్, రవీందర్, లక్ష్మణ్, పర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ శ్రమ్ కార్డులు పంపిణీ

చొప్పదండి: ఈ శ్రమ్ కార్డుల కోసం ఉచితంగా నమోదు చేసుకోవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ తెలిపారు. పట్టణంలోని ఏడో వార్డులో పలువురు అసంఘటిత రంగ కార్మికులకు సోమవారం స్థానిక రెడ్డి సంఘం భవనంలో ఈ శ్రమ్ కార్డులను అందించారు. కార్డులతో రూ. 2 లక్షల వరకు ప్రమాదబీమా వర్తిస్తుందని, కార్డు కోసం ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రయోజనాలున్నాయని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుర్రం మంగ, ఆర్‌ఎస్ఎస్ కన్వీనర్ గుర్రం హన్మంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో ఆధార్ నమోదు క్యాంపు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ నమోదు క్యాంపును ఎంపీపీ లింగాల మల్లారెడ్డి సందర్శించారు. అనంతరం నమోదు పత్రాలను అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవడం తప్పనిసరి అని సూచించారు. కార్యక్రమంలో మల్లేశం, తిరుపతి, కుమారస్వామి, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్: కొత్త టారీఫ్ విధానాన్ని రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్లు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నూతన టారీఫ్ ఆర్డర్ ద్వారా వినియోగదారులు టీవీ చూడాలంటే భారమవుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న కేబుల్ ఆపరేటర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. బ్రాడ్‌కాస్టర్లకు వ్యతిరేకంగా రెండు రోజుల నుంచి చానళ్లు నిలిపివేశామన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



చిగురుమామిడి: మండలంలోని రామంచ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను పాఠ్యాంశ బోధనలో భాగంగా ఉపాధ్యాయులు ఢిల్లీ, ఆగ్రాకు తీసుకెళ్లారు. హిందీ పండిట్ షరీఫ్‌అహ్మద్ నేతృత్వంలో ఎనిమిది, ఏడో తరగతి విద్యార్థులు చరణ్‌తేజ్, విష్ణు, మణిదీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, రిషిత్‌రెడ్డి సోమవారం రెడ్‌పోర్ట్, ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ ఆవరణలోని లోటస్ టెంపుల్, కుతుబ్‌మినార్‌ను ప్రత్యక్షంగా చూశారు. వీటి చరిత్రను షరీఫ్‌అహ్మద్ విద్యార్థులకు వివరించారు. చిన్న వయస్సులో దేశ రాజధాని ఢిల్లీ, ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను, వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానాలు, ఇతరల అంశాలను పర్యటన ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు.

ఉపాధ్యాయుల సన్మానం



శంకరపట్నం: మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ పండిట్ రజియోద్దీన్‌ను సోమవారం హెచ్‌ఎం, టీచర్లు సన్మానించారు. మండలంలోని కరీంపేట పాఠశాల నుంచి రజియోద్దీన్‌ను మొలంగూర్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చారు. మొలంగూర్‌కు కొత్తగా హిందీ పండిట్ రావడంతో వీడ్కోల్ పలికారు.

'బీజేపీకి బుద్ధి చెప్పాలి'

హుజూరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. సీసీఐ సంస్థకు బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో బడ్జెట్ కేటాయించకపోవడంతో పత్తిని నమ్ముకున్న రైతులకు రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఐటీ దాడులు చేయటం ఏంటని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు గుండేటి వాసుదేవ్, కదిరి రమేష్, పోతారం అశోక్ ఉన్నారు.